# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 308: ప్రియత్వం ముఖ్యం, సామీప్యం కాదు
# ఫిబ్రవరి 24, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 107-114 నుండి తీసికొనబడినవి

స్వామి, ఈ నాడు సాయి వైభవం ప్రపంచపు నలుమూలల నుండి అందరినీ మీ పాదాల చెంతకు చేర్చింది. కొన్ని పేర్లు తెలియని దేశముల నుండి కూడా భక్తులు మీ వద్దకు వస్తున్నారు. రకరకాల భాషల వారు వస్తున్నారు. అన్ని రంగాల వారు వస్తున్నారు. విదేశీ భక్తుల కంటే మీ దగ్గరే ఉండే మాకు వారికున్నంత భక్తి కూడా లేకపోవడం మా దురదృష్టం. మీ బోధనలను మా కంటే వారు ఎంతో శ్రద్ధతో పాటిస్తుంటారు. ఇలా ఎందుకౌతుంది స్వామి?

భగవాన్: భక్తుల అనుభవాలు వారి శ్రద్ధ, సద్భావం పై ఆధార పడి ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే సామీప్యం వల్ల దైవత్వం యొక్క నిజ స్వరూపం తెలుసుకోవడం కష్టమౌతుంది. దీపం కిందే చీకటి ఉంటుంది కదా? అదే విధంగా అవతారం యొక్క ప్రకాశం అన్ని ప్రదేశములకు ప్రసరించినా, ఆ ప్రకాశం కిందే చీకటి ఉంటుంది.

తేనెటీగలు తామరపూవు లోని తేనె కొరకు ఎక్కడెక్కడినుంచో వస్తాయి, కానీ ఆ తామరపూవు కిందనే ఉన్న కప్పలు, నత్తలు, చేపలకు ఆ తేనె రుచి తెలియదు. అదే విధంగా పరమాత్మ అవతారమెత్తి వచ్చినప్పుడు, సమీపంలో ఉన్న వారు ఆ అవతార మహత్యం గ్రహించలేరు.

మామిడిపండు అనే పదం వినగానే దానిని తినాలనిపిస్తుంది. కానీ బజారుకు పోయి అక్కడ పండ్లను చూచినప్పుడు దానిని వాసన చూస్తారు. ఎందువలన? అది పండిందా లేదా అనే సంశయం వలన. దాని పేరు వినగానే తినాలనిపించింది కానీ దగ్గిరగా చూచినప్పుడు సంశయం.

అంత దూరం ఎందుకు? బాబా కలలో వచ్చాడని అందరికీ ఎంతో ఆనందంతో చెప్పుకుంటారు. కానీ బాబా దర్శనం చేసుకుంటున్నప్పుడు కొంచం కూడా ఉత్సాహము, ఉద్వేగము ఉండదు. నా దగ్గిరే ఉన్న మీకు బయటి ప్రపంచములో అందరికీ ఎంతెంతటి అనుభవాలు కలుగుతున్నాయో మీకు తెలియదు. బావిలో కప్పలకు బయటి ప్రపంచం తెలియదు.

స్వామి దగ్గిర ఎంత కాలం ఉన్నారో, ఎన్నేళ్ళు ఉన్నారో, ఇవి కాదు లెక్క. బస్సు డ్రైవర్లు రోజూ ఇక్కడి నుంచే పోతుంటారు, వస్తుంటారు. వారికి ఏమి అనుభవాలున్నాయి? ఇనుప గుండును బావిలో ఎన్ని రోజులు పెట్టినా ఏమాత్రం మార్పు చెందదు. చీకటిని వెలుతురు మాత్రమే నశించగలదు. అదే విధముగా అజ్ఞానము నశించాలంటే జ్ఞానమనే వెలుతురు కావాలి.
స్వామిపై పూర్తి నమ్మకము, ప్రేమ ఉంటే స్వామి బోధనలను తప్పక పాటిస్తారు. ఎంతో మందిలో పరిపూర్ణ పరిణామం కనపడటానికి కారణం ఈ దైవత్వంలో ఉన్న ప్రేమ వారిని ఆకట్టుకొని ప్రశాంతి నిలయానికి ఆకర్షిస్తుంది.

భగవంతుని మాత్రమే ఈ విధంగా గౌరవించి, ప్రేమించి, పూజించగలుగుతారు. మీ అధికారిని గౌరవించవచ్చు. మీ తల్లితండ్రులను, స్నేహితులను ప్రేమించవచ్చు. కానీ మీ అధికారులను, కుటుంబ సభ్యులను పూజించరు కదా? ఒక్క భగవంతుని మాత్రమే గౌరవించి, ప్రేమించి, పూజిస్తారు.

స్వామి, ఆర్జెంటినా, ఫిలిప్పీన్స్, గ్వాటిమాల, రష్యా, మరెన్నో దూరపు దేశముల నుండి ఎంతో మంది భక్తులు వస్తున్నారు. ఏ దేశపు పేరు విన్నా వారు ప్రశాంతి నిలయంలో కనబడుతారు. ఇక్కడి నుండి తిరిగి వెళ్ళేడప్పుడు ఎంతో భారమైన హృదయాలతో బయలుదేరతారు. అలాంటి సమయంలో వారు ఎలా ఉండాలి, ఏమి చేయాలి?

భగవాన్: మీరు భగవంతుని సర్వజ్ఞతను గుర్తించాలి. భగవంతుడు ఎల్లప్పుడూ మీ ఇంటనే, వెంటనే, కంటనే, జంటనే ఉంటాడు. నిజానికి నీవే దేవుడు. భక్తులు వారి batteries recharge చేసుకోవడానికి స్వామి దగ్గిరకు వస్తారు. ఎప్పుడూ గుర్తు పెట్టుకొనవలసినది ఏంటంటే స్వామికి 'near' (సామీప్యం) కంటే 'dear' (ప్రియత్వం) ముఖ్యం. గాలి వీచినప్పుడు నిప్పు చెలరేగుతుంది. రెండు చెక్కలు పక్క పక్కనే పెడితే సామీప్యమౌతుంది. వాటిని వెలిగించినప్పుడు గాలి విసిరితే నిప్పు పెద్దదౌతుంది. ఈ విసరడము ప్రియత్వం. సామీప్యం ఒక్కటే సరిపోదు.

ఒక కొలనులో తామరపూవు ఉంది. అదే కొలనులో చేపలు, కప్పలు కూడా ఉన్నాయి కానీ వాటికి ఆ తామరపూవు విలువ తెలియదు. తేనెటీగలు ఆ తామరపూవు లోని తేనె కొరకు ఎంతో దూరం నుండి వస్తాయి. ఆ తేనెటీగలు ప్రియత్వమైతే, కప్పలు, చేపలు సామీప్యంతో లెక్క.

అదే విధంగా lighthouse (దీపగృహం) ఓడలకు దారి చూపించుటకై తన ప్రకాశామును చుట్టూ వెదజల్లుతుంది. కానీ lighthouse కిందే చీకటిగా ఉంటుంది. ప్రకాశం ప్రియత్వమైతే కింద ఉండే చీకటి సామీప్యం. ఇక్కడి నుండి బయలుదేరే భక్తులు స్వామికి ప్రియంగా ఉండటానికి ప్రయత్నించాలి కానీ సమీపంగా ఒక్కటే ఉంటే సరిపోదు.

స్వామి, మాలో చాలా మంది మీ దగ్గిర ఉన్నప్పుడు ఎంతో భక్తితో, వినయంతో, క్రమశిక్షణతో ఉంటాము. కానీ వేరెక్కడో ఉన్నప్పుడు మారిపోతాము. ఇక్కడ నేర్చుకున్నవన్నీ ఎందుకు మర్చిపోతాము? నిజాయితీ, భక్తి, శ్రద్ధల వంటి పవిత్రమైన గుణములు కోల్పోతాము. దయచేసి మా తప్పులను మన్నించి ఎందుకు ఇలా జరుగుతుందో తెలియపరచండి.

భగవాన్: నీవు అడిగిన ప్రశ్న తప్పు. మీరిక్కడ ఉన్నప్పుడు ప్రదర్శించే నిజాయితీ, భక్తి, శ్రద్ధలు వంటి ఘనమైన గుణాలు మీ సహజ గుణాలు కాదు. కృత్రిమైనటువంటివి. ప్లాస్టిక్ పువ్వుల వలె సువాసన ఉండవు, తుమ్మెదలను ఆకర్షించవు. అవి పైపై ప్రదర్శనలు మాత్రమే. భగవంతుడు ఈ కృత్రిమమైన, అనిత్యమైన, బాహ్య ప్రదర్శనలకు లొంగిపోడు. భగవంతుడు నీ ఆంతరంగిక స్వభావమును మాత్రమే చూస్తాడు.

పరిస్థితుల వల్ల మీలో మార్పులు వస్తుంటాయి అనడం పొరపాటు. మీలో పవిత్ర గుణములు సహజంగా ఉండి ఉంటే పరిస్థుతులు వాటిని మార్చలేవు. బాహ్య ప్రపంచములో ఏమి జరిగినా మార్చలేవు. మీలో ధృడమైన నమ్మకము, విశ్వాసము లేవు. మీలోని విత్తనములు సరైన సమయం కొరకు వేచి ఉన్నాయి. పరిస్థితులకు కాళ్ళు, చేతులు లేవు, మీలాగ కదలడానికి!

ఇప్పుడు మీరు కోడైకనాల్లో ఉన్నారు. స్వెటర్లు, శాలువాలు, రగ్గులు, ఉన్ని దుప్పట్లు కప్పుకున్నారు, ఈ చలి ప్రదేశంలో వెచ్చగా ఉండటానికి. మీ దగ్గిర వెచ్చని బట్టలు లేకపోతే ఎవరిది తప్పు? ఎవరిని తప్పు పడతావు? అదే విధంగా ఈనాడు ప్రపంచములో జీవించడం ఎంత కష్టమో మీకు తెలుసు. భగవంతుని ఆజ్ఞలపై అలక్ష్యం, అశ్రద్ధ వంటి చల్లటి గాలులు వీచినపుడు కర్తవ్యమనే కంబళి, భక్తి అనే రగ్గు, క్రమశిక్షణ అనే స్వెటరు ధరించడం మీ బాధ్యత. ఇటువంటి వెచ్చని బట్టలు ధరిస్తే ఎటువంటి చలి అయినా భరించవచ్చు. పరిస్థితులపై నింద వేయడము వల్ల లాభము లేదు. మీలో సద్భావనలు, సత్ప్రవర్తనలు ఉంటే ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనవచ్చు.

స్వామి, తమ దయ, అనుగ్రహం వల్ల మాత్రమే మేమిక్కడ ఉన్నాము. మీరు ముప్పాతిక వంతు సమయము మీ పిల్లలతో గడుపుతారంటారు. మేము ఏమి చేయాలి స్వామి?

భగవాన్: మీరు నాకేమి చేయనక్కరలేదు. నాకు మీనుండి ఏమీ అక్కరలేదు. నేను ఎప్పుడూ ఇవ్వడమే కానీ తీసుకోవడమనేది లేదు. నేను ఎవరి వద్దనుండి ఏమి స్వీకరించను. నేనెవరి వద్ద నా చేయి చాపను. నేనెవరినీ ఎప్పుడూ ఏమి అడగలేదు. అన్నియు స్వామి సంకల్పము వల్లనే జరుగుతుంటాయి. నేనడిగేది ఒక్కటే. అది మీ ప్రేమ.

మీ తల్లితండ్రులు ఒక్కొక్కప్పుడు మీనుండి దూరంగా ఉంటారు. కానీ నేను మాత్రం ఎప్పుడూ మీ ఇంటనే, వెంటనే, కంటనే, జంటనే ఉంటాను. నేనే మీరు. మీరు ఇది ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకుంటే అదే చాలు. స్వామిని అనుసరిస్తే మీరు ఒక వజ్రం వలె ప్రకాశిస్తారు. మీకు సమాజంలో ఎంతో ఆదరణ లభిస్తుంది. మంచి పేరు వస్తుంది. ఈ హాస్టల్లో, కాలేజీలో నేర్చుకున్నవి, స్వామి వద్ద పొందిన ప్రేమ, అవి మాత్రం మర్చిపోకండి. మంచి పేరు తెచ్చుకోండి. స్వామి బోధనలను పాటించండి.

ధన్యవాదములు. వచ్చే వారము ప్రొఫెసర్ అనిల్ కుమార్ గారి "సత్యోపనిషద్" పుస్తకములోని మరి కొన్ని ఆధ్యాత్మిక మాణిక్యములతో మళ్ళీ కలుద్దాం.